# పట్టెడు మెతుకులు

## శ్రీ కలువకొలను సదానంద

"పట్టెడన్నం పెట్టు తల్లీ!"

మిట్టమధ్యాహ్నంవేళ వాకిట్లో ఉరుము ఉరిమింది.

భోజనం ముగించి ఆ ఉరుముకోసమే వేచి వున్నట్లు వసారాలో వాలు కుర్చీలో కూర్చునివున్న రాయప్పలో చలనం కలిగింది.

వాడేనా?...

నిలువునా కాలిపోయిన చింతమొద్దులావున్న ఆరడుగుల విగ్రహమూ, దిష్టిబొమ్మను తలపింపజేసే తెల్లగుమ్మడికాయంత తల, గాజుగోళాలవంటి మిడిగుడ్లు, ముంతమామిడికాయలాంటి ముక్కు, లావుపాటి పెదవులమీద భయంకరమైన పిచ్చినవ్వు, మాసిన గడ్డం, చింపిరిజుట్టు, మొలచుట్టూ మురికిబట్ట... వాడే! బలికి సిద్ధంచేసిన దున్నపోతులా వున్నాడు! వెధవ! బదరీనాథ్‌కు వెళ్లరాదూ? ఒక్కసారికి ఇద్దరేసి యాత్రికులనుమోస్తూ వేనకువేలు సంపాదించుకోవచ్చు! చట్టిచేతబట్టుకొని ఊరిమీదపడ్డాడు, సోమరిపోతు! ఊరి సొమ్ముతిని ఒళ్లు పెంచుకోటానికి—కాలు సొట్టా, కన్నుసొట్టా? భిక్షగాడికుండవలసిన యోగ్యత ఒక్కటైనా వుందా? పోనీ, ఆ నిలబడే నాణ్యంతో, అడిగే తీరులో కాసంత వినయమైనా ఏడిసిందా? బిచ్చగాళ్లకంతా తానేదో ప్రతినిధి అయినట్లు నిటారుగా నిలబడి, వీడి తాత సొమ్మేదో యిచ్చిపెట్టినట్లు ధారాళంగా అడుగుతాడు—పొగరుబోతు చెధవ!

ఎన్నిసార్లు తిట్టి, తరిమినా—వాడు రావడం మానుకోడు. పూట పూటకు వస్తూనే వుంటాడు. రానీ! తన దగ్గరా వీడి మొండితనం? ఈ రాయప్ప వాలుకుర్చీలో ఆసీనుడై వుండగా, వీడు అన్నం పెట్టించుకు పోగలడా?

'అయ్య వద్దంటుంటే, అమ్మ ఎలా పెడుతుందనుకున్నావురా పిచ్చినాగన్నా అన్నంలేదు, ఆవకాయా లేదు. పోపో!' అంటూ—ఆ యింట్లో తన ఆధిక్యతను ప్రదర్శించే హుందాతనంతో కసరి కొట్టాడు రాయప్ప.

ముష్టివాడు అంతకన్నా హుందాగా అక్కడి నుండి కదలి, మరో యింటి ముందరికి వెళ్లాడు.

రిటైర్డు ఆఫీసరు రాయప్ప వాలు కుర్చీలో వాలి, గంటల తరబడి ఆలోచిస్తూ ఏకాంతంగా గడపడమనే అభ్యాసం ప్రారంభించి యిప్పటికి మూడు నెలలు కావస్తున్నది. అంతకుముందు ఆలోచించడానికి అతనికి అవకాశం వుండేదికాదు. అతని చేయి మేజామీది బెల్లును ఘల్లు మనిపిస్తూనో, ఫైళ్లలో గరగరలాడుతూనో వుండేది. అతని నోరు బంట్రోతులమీద, గుమాస్తాలమీద, రెవిన్యూ ఉద్యోగులమీద అస్త్రపరంపరలను కురిపిస్తూనే వుండేది. ఆ అలవాటును మానుకోలేని రాయప్ప— ఈ మూడు మాసాలుగా ఇంటి ఛాయలకు వచ్చే కుక్కలమీద చేయి చేసుకోవడంతోను, ముష్టివాళ్లమీద నోరు చేసుకోవడంతోను సరిపెట్టుకోగలిగాడు.

అతను వాలుకుర్చీలో గడపడం ప్రారంభించిన తొలి రోజుల్లో అతని ఆలోచనలకు ఒక లంగరంటూ లేకుండా వుండేది. ఆ ఆలోచనా భ్రమణానికి ఒక కేంద్ర విషయమంటూ లభించడానికి ఎన్నో రోజులు పట్టలేదు.

రాయప్ప నిద్ర లేచినదే తడవుగా కాలకృత్యాలు ముగించుకుని, ఉపాహారం పుచ్చుకుని, కాఫీ సేవించి, చుట్ట కాల్చుతూ వసారాలో—వాలుకుర్చీలో కూర్చుం

టాడు. తెరమీాది సినిమా బొమ్మల్లా నిమిష నిమిషా నికీ వీధిలో నడయాడుతూ కనిపించే ముష్టివాళ్ల రాయప్ప ఆలోచనల్ని తమ పైకి కేం దీకరించుకో గలిగారు.

అతడి సిద్ధాంతం ప్రకారం ప్రపంచంలో మూడు రకాల మనుషులున్నారు. ఒకడు అత్యాశాపూరి తుడు. మరొకడు అత్యాశలేనివాడు, సోమరిపోతుకాని వాడు. ఇంకొకడు వట్టి సోమరిపోతు. గడనకోసమే కాలాన్ని వెచ్చించే అత్యాశాపరుడు తిండి తినడమనే వృధా కాలయాపన చేయలేదు. అతడు కష్టపడీ, తిన లేకపోతున్నాడు. సోమరితనమూ, అత్యాశాలేనివాడు కష్టపడుతున్నాడు, తింటున్నాడు. కానీ, ఈ మూడో వాడు—సోమరిపోతు—కష్టపడడు; హాయిగా తింటు న్నాడు. ఈ ముష్టివాళ్లంతా సోమరిపోతులు!

కంటబడిన ముష్టివాళ్ల నందరినీ శ్రద్ధగా పరిశీలించడం, వాళ్లనుగూర్చి ఆలోచిస్తూ వుండడం—రాయప్పకు ముఖ్యవ్యాసంగమైపోయింది. ఈ మూడు మాసాల్లో— ప్రపంచంలోఎన్ని భాషలున్నాయో, అన్ని రకాల ముష్టివాళ్లను అతను చూశాడు. ఒకడి వేషా నికీ, మరొకడి వేషానికీ ఎక్కడా పోలికే లేదు. ఆ లేక పోవడమనేది బహుశా ఆ వృత్తిలోని ప్రధాన సూత్రం కావచ్చు!

ఒకడు కోతి నాడిస్తూ వస్తాడు. ఒకడు ఎలుగు బంటుతో వస్తాడు. ఒకడు పామును భుజాన వేసు కుని వస్తాడు. ఒకడు నెత్తిన గంగమ్మతల్లిని మోసు కుని వస్తాడు. ఒకడు గిరుడగింబం పట్టుకుని గంట వాయించుకుంటూ వస్తాడు. ఒకడు కాషాయగుడ్డలు తగిలించుకుని వస్తాడు. ఒకడు మూర్ఛరోగినంటూ మెడలో పెద్ద రాగిరేకు వేలాడదీసుకుని వస్తాడు. ప్రపంచంలో రేడియోలన్నీ పనిచేయనట్లు, తాను తప్ప ప్రపంచాని కిక వేరు గతి లేదన్నట్లు–ఒకడు గొంతెత్తి పాడుతూ వస్తాడు. వీళ్లందరూ సోమరిపోతులుగాక, మరెవరు?

వీళ్లతోబాటుగా అప్పుడప్పుడు కుంటివాళ్లు, గ్రుడ్డివాళ్లుకూడా అతనికి తారసపడకపోలేదు. వారి మీాదకూడా అతనికి ఈ షణ్మాత్రమైనా సానుభూతి లేదు. వాళ్లు కుంటి వాళ్లుగా, గ్రుడ్డివాళ్లుగా నటి స్తున్నారనీ—ఒకవేళ ఆ అంగవైకల్యం నిజమే అయితే సుఖజీవనంకోసం తమకు తామే బుద్ధిపూర్వకంగా ఆ అంగవైకల్యాన్ని కలుగజేసుకుని వుంటారనీ అతని అనుమానం. వాళ్లు వికలాంగులుకారు! మోసగాళ్లు! ప్రభుత్వం వీళ్లందరినీపట్టి బానిసలుగాచేసి, జాతీ యాభివృద్ధి కార్యకలాపాలకు వినియోగించుకుంటే—దేశం బాగుపడిపోదూ?

వారిపట్ల రాయప్పకున్న ఏహ్య భావం, ద్వేషం యినుమడించడానికి వారి వినయ విధేయతారహిత ప్రవర్తనకూడ కారణమే! తాను (రిటైర్డు) తాసీ ల్దారుకదా?...ఏ మాత్రం జంకుగొంకులు లేక తనకు ఎట్టయెదుట నిటారుగా నిలబడి, బిచ్చంపెట్టించు కోవడం జన్మహక్కులా కేకపెట్టడమేనా మర్యాద?... పోనీ, తాను వెళ్లమంటే ఒక్కమాటతో వెళ్లిపోవాలి కదా? ఎంతకూ కదలక ఒకటికి పదిసార్లు గీపెడితే, దాన్నేమనాలి? తల బిరుసుకదూ?

అందుకే, ముష్టివాడన్నవాడు ఈ యింటి దరిదాపులకైనా రాకూడదు. వస్తే—'రాయప్పగారు న్నారు! జాగ్రత్త!'...ఈ ఆరుఖండాలూ ఒకే ఇల్లయి పోతే బాగుండును. అప్పుడు ఆ యింటి వసారాలో వాలు కుర్చీ వేసుక్కూర్చుని, ఈ ముష్టివాళ్లందరి ఆట కట్టించవచ్చును!

నిలువునా కాలిపోయిన చింతమొద్దులావున్న ఆ ఆరడుగుల ఎత్తున బిచ్చగాణ్ణిచూస్తే అరికాలి మంట నెత్తికెక్కుతుంది రాయప్పకు. వాడికి పరమ శత్రువెవడైనావుంటే, ఒక్కరాయప్పే! ఆయన వుండగా వాడు ఒక్కపూటైనా అన్నం పెట్టించుకోలేదు. రాయప్ప ఊహలో—వాడొక ముష్టివాళ్ల సంస్థ! వాళ్ల సోమరితనానికి అచ్చుబొమ్మ!

అప్పుడప్పుడూ అతని అంతరాత్మ అతని ఈ స్థిరాభిప్రాయాలకు భిన్నంగా ఆలోచించడంకూడా కద్దు. వీళ్లలో చాలామంది సోమరిపోతులైతే—మిగిలిన వాళ్లు గత్యంతరం లేక ముష్టివాళ్లైన వాళ్లు. కొందరు రోగపీడితులు. కొందరు వికలాంగులు. కొందరు దుర్బలులు. వాళ్లు ముష్టెత్తుకోవటానికి వారి దౌర్భాగ్యమో, దారిద్ర్యమో కారణమై వుండాలి.

ఆ దురవస్థ మానవుడికిగాక మరే ప్రాణికి ప్రాప్తిస్తుంది ?

రాయప్ప వాళ్లను చూచినప్పుడల్లా తన సౌభాగ్యాన్ని మననం చేసుకునే వాడు. తనకూతురు ఒకానొక ఉన్నతకుటుంబంలో కోడలు. తనకొడుకు హైదరాబాదులో ఉన్నతోద్యోగం చేస్తున్నాడు. తాను అతి జాగరూకుడు. వారిమీద ఆశ అడియాసగా పరిణమించే రోజుకూడా రావచ్చును. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే—తన భావిజీవితానికి రక్షణ చేకూర్చుకోగలిగాడు తాను. ఉండటానికి యిప్పుడే మేడ వుంది. బ్రతుకు గడుపుకోవడానికి నెలనెలా పెన్షన్ వస్తుంది. కొండంత అండగా బ్యాంకులో పాతికవేల రూపాయల రొక్కం వుంది. ఇది చాలు. తనకా దురవస్థ ఏదో ప్రాప్తించటానికి అవకాశం గోరంతైనా లేదు.

...ఈ విధమైన ఆలోచనలతో వాలుకుర్చీలో మూడు మాసాలు గడిపాడు రాయప్ప.

*　　*　　*

వేళకు తింటూ, వాలుకుర్చీలో వాలి సదా ఒకే రకమైన ఆలోచనల్ని నెమరు వేసుకుంటూ వుండడమనే జీవన సరళిపట్ల ఒకింత వెగటు పొడసూపింది, రాయప్పలో.

తనకు ఉల్లాసం కావాలి. కాలక్షేపంలో కొత్తదనాన్ని వెతుక్కోవాలి. రాయప్ప ఆ సాయంకాలం అలా వాహ్యాళి వెళ్లి రావాలనుకున్నాడు.

ఇల్లాలు అందించిన కాఫీ త్రాగి, ముఖం కడుక్కున్నాడు రాయప్ప. చొక్కా తొడుక్కుని ఊతకర్ర చేతబట్టుకుని బయలుదేరాడు. విలాసంగా కర్ర ఊపుకుంటూ, ఎదురుపడిన పరిచితుల నమస్కారాలను చిరునవ్వుతో అందుకుంటూ ఊరిబయటకు చేరుకున్నాడు. తెల్లమబ్బుల నీలాకాశంతో, పచ్చని పొలాలతో, పిట్టల పాటలతో, చల్లని మలయసమీరంతో, సాయంకాలపు ప్రశాంతతతో ఆహ్లాదకరంగా వున్నది ప్రకృతి. సాయంతపు శోభనం యిలా ఏకాంతంగా అనుభవించడం తనకు కొత్తగాను, ఆనందదాయకంగాను వుంది. తాను తాసీల్దారుగా వున్న రోజుల్లో తనకీ అవకాశం వుండేదికాదు. మనుషులు తనను ఏకాంతంగా వుండనిచ్చేవారు కారు.

రాయప్పకు నడక ఉల్లాసజనకంగా వుంది.

అతను నడుస్తూన్న కాలిబాటమ అనుకుని చిన్నగుట్ట ఒకటుంది. ఆ గుట్టమీదికి నడిచివెళ్లడం కష్టమనిపించలే దతనికి. ఎక్కడైనా కొంతసేపు కూర్చోవాలనిపించింది. కొండరాళ్ల నడుమ ఒక అనువైన చోటు చూసుకుని కూర్చున్నాడు. కొండమీద కొన్ని గజాల దూరంలో పాడుబడిపోయిన చిన్న దేవాలయం కనిపిస్తున్నది. గుట్టంతా ఎర్రటిమట్టితోను, చిన్నచిన్న గులకరాళ్లతోను, పెద్దపెద్ద బండలతోను, రకరకాల ముళ్లపొదలతోను కప్పబడివుంది. గుట్టపైనుంచీ చూస్తూంటే—ఊరంతా ఒక పెద్దబొమ్మల కొలువులా కనిపిస్తున్నది.

ఎప్పుడూ లేనిది ఈనాడు యింతదూరం నడిచి వచ్చినందుకు కాబోలు—రాయప్ప పొట్టలో ఆకలి మెదిలింది. తాను చివరిసారిగా కచ్చేరీమెట్లు దిగిన నాటినుంచీ గంటగంటకు ఆకలి అతన్ని పరామర్శిస్తూనే వుంది. ఆ రోజుల్లో భోజనాన్ని గురించి కూడా తానెప్పుడూ ఆలోచించేవాడు కాడు. సోమరితనానికీ, ఆకలికీ వున్నంత సాన్నిహిత్యం మరిదేనికీ వుండదేమో!...తాను యింటికి తిరిగి వెళ్ళేసరికి వంట పూర్తయి వుంటుంది. వెళ్లగానే పీటమీద కూర్చోవచ్చును!

రాయప్ప మనోభ్రమరం భోజనంచుట్టూ పరిభ్రమిస్తూన్న సమయంలో—అతని ముఖం—కొంత దూరానవున్న శిథిలాలయాభిముఖమై వున్నది. గుడిలోనుండి హఠాత్తుగా బయటికి వచ్చిన ఒక మానవాకారం ముళ్లపొదల మధ్యగా కనిపించిందతనికి. రాయప్ప సంశయపూరిత వీక్షణాలతో ఆ ఆకారాన్ని పరకాయించి చూశాడు. ఎవరది?...వాడేనా?...ఔను!...వాడే! చింతమొద్దు! బిచ్చగాళ్ల ప్రతినిధి!

రాయప్పకెందుకో భయంవేసింది. తన ఆధికృత ఈ సమయంలో పనికిరానిదిగా అనిపించింది. ఈ ముష్టివాడికి తనపట్ల ఎటువంటి అభిప్రాయం వుంటుంది?...సందేహం లేదు...వీడికెవడైనా శత్రువు వుంటే, ఆ శత్రువు తానుతప్ప మరొకరయి వుండరు. వీడికి భిక్షం వేయనీయలేదు తాను. అంతే కాదు. కసిరికొట్టాడు. తిట్టిపోశాడు. ఆ సందర్భా

లలో తాను అవధులులేనంతటి వాక్స్వాతంత్ర్యాన్ని వినియోగించుకున్నాడు. తన ప్రవర్తన వీడి మనస్సులో ఎటువంటి ముద్రవేసి వుంటుంది?...రాయప్ప భయం రెండంతలైంది.

తన యింటిలో తానుండగా—ఎన్నయినా అన గలడు, ఏమయినా చేయగలడు. అదిస్థానబలిమి! ఇక్కడ తాను జలాశయం వీడివచ్చిన మొసలివంటి వాడు. ఈ ముష్టివాడు తననిచూస్తే, తనదారిన తాను పోతాడా?...ఏమో!...తిడతాడా?.. కొట్టకుండా తిట్టినా ఫరవాలేదు. కొడతాడా?...గోయితీసి పాతి పెట్టకుండా, కొట్టిపంపినా ఫరవాలేదు. రాయప్ప భయం మూడంతలైంది.

ఈ గుట్టమీద—పొదలచాటున—బండలచాటున వీడు ఏమి చేయాలనుకున్నా, నిర్విఘ్నంగా, నిరాటంకంగా చేయగలడు. తాను వీడి దృష్టిలో పడే లోపున ఇక్కడినుండి వెళ్ళిపోవాలి. గుట్టక్రింది కాలి బాటను చేరుకోగలిగినా చాలు. బ్రతికిపోవచ్చు.

ఆ భయంకరుడి కంటబడకుండా క్రిందికి వెళ్ళిపోయే ప్రయత్నం ప్రారంభించబోతుండగా—వాడు రాకూడని దిశగానే రాసాగాడు. ఇక రాయప్ప భయం కొలతకందనిదైపోయింది. తానిక తప్పించుకుపోయే అవకాశం లేదు. వాడి కంటబడకుండా దాగుకోవడం తప్ప గత్యంతరమూ లేదు.

కూర్చునివున్న రాయప్ప లేచాడు. అయితే నిల బడలేదు. పొంచివుండి పిట్టలుపట్టే వాడి భంగిమ అది. రాయప్ప నాలుగైదడుగులు వెనక్కిప్రాకాడు. ఒక పెద్దకొండరాతిని చాటుచేసుకున్నాడు ..వాడు వస్తున్నాడు! తనని చూశాడా?...అతడు మరికొన్ని అడుగులు వెనక్కువేశాడు. గోడలకు మల్లే నిట్ట నిలువుగావున్న రెండు బండలమధ్యకు వచ్చాడు. ఒక్క క్షణం శ్వాసతీసుకుని, బండచాటునుండి తొంగి చూశాడు. వాడు వస్తున్నాడు! రాయప్ప మరి రెండడుగులు వెనక్కి నడిచాడు. మూడో అడుగుకి నేల అందలేదు.

*　　*　　*

రాయప్పకు నడుము పట్టేసింది. ఎడమకాలు బెణికింది. కుడిమోకాలు డొక్కుపోయింది. మూలుగుతూ చిన్నగా లేచి నిలబడ్డాడు. తాను ఒక రాతి గోతిలో పడిపోయాడు! రాతిగోడ నానుకుని నిలబడి చేయి పైకెత్తాడతను. అంచు అందలేదు. మూరెడెత్తు పైకి గెంతగలిగితే, అంచును అంది పట్టుకో వచ్చు!

ముష్టివాడు ఊహలో మెదిలాడు. వస్తున్న మూలుగును దిగమింగాడు రాయప్ప. తన మూలుగు వాడు వింటే యింకేమైనా వుందా? బోనులో చిక్కుకున్న ఎలుకను బోనుతోబాటుగా నీళ్ళల్లో ముంచి నట్లు తయారవుతుంది తన స్థితి.

నిశ్శబ్దంగా, నిశ్చలంగా అరగంట గడిపాడు రాయప్ప. ఆకు అల్లాడినా, పిట్ట కూతపెట్టినా అదిరి పడుతున్నాడు. ముష్టివాడు తనని చూడకుండావుంటే ఫరవాలేదు. చూచివుంటే, ఇక ఏం జరుగుతుంది?... తనకోసం వాడు పరిసరాలంతా వెతుకుతూ వుంటాడా?

భయవిహ్వలమైన ఈ ఊహలతోనే రాయప్ప తానున్న గోతిని పరిశీలించసాగాడు. అదొక రాతి దొన. లోతు సుమారు తొమ్మిదడుగు లుండవచ్చు. దొన మూడు వైపులా అట్టడుగునుండి రాయి పైకిలేచి పైకప్పులా వాలి వుంది. తాను ఏవైపునుండి పైకి ఎగబ్రాకినా, నాలుగోవైపునుండే బయటపడాలి.

సంధ్య అంతరించిపోతున్నది. మసక చీకట్లు ముసురుకుంటున్నాయి. పిట్టల కూతలతో చెవులు గింగుర్లెత్తిపోతున్నాయి.

ముష్టివాడు తనని చూసివుండడు. వాడెటో వెళ్ళిపోయివుంటాడు. ఇక తాను తన యావచ్ఛక్తినీ ఉపయోగించి గట్టున పడాలి. రాయప్ప పైకెక్కడానికి ప్రయత్నించాడు. ప్రయత్నం ఫలించలేదు. చేతులకు పట్టు దొరకడంలేదు. రాతిగోడలమీద చేతులు, కాళ్ళు జారిపోతున్నాయి. చేతికందిన మేర ప్రతి అంగుళాన్ని తడిమి, పట్టు దొరకక—దొరికినా పైకెగ బ్రాకలేక—రాయప్ప దిగులు పడిపోయాడు. ఈ శ్రమలో అతని ఒంటినొప్పులు కూడా యినుమడించాయి.

ఆశ నిరాశ చేసుకుని, ఇరుసు విరిగిపోయిన బండిలా కూర్చుండిపోయాడు రాయప్ప.

చీకట్లు క్రమ్ముకున్నాయి. ఈ గోతిలోనుండి బయటపడటం యిక తన శక్తికి మించిన పని. ఆ పని

ఎవరైనా వచ్చి చేయాలి. తానిక్కడున్న సంగతి ఎవ రికి తెలుసు? ఇక్కడినుండి తాను కేక పెట్టాలి. ఈ చీకటిలో ఈ గుట్టమీద ఎవరుంటారు? ఒక వేళ ఆ పాడుబడిన గుడివద్ద ముష్టివాడున్నాడేమో?

రాయప్ప కేక పెట్టలేదు. అవనతశిరస్కుడై కూర్చున్నాడు. తెల్లవారాక, మేకలకాపరులో, కట్టె లేరుకునేవాళ్లో—యిలా, ఈ గుట్టమీదికీ రాకపోరు. అంతవరకూ తనకీ దురవస్థ తప్పదు. దొనలో శిలా తల్పంమీద శయనావస్థలోకి వాలిపోయా డతను. ఆకలి—సమస్యగా పరిణమించి అతన్ని పీడించసాగింది. తాను ఏనాడూ నిరాహారంగా వుండలేదు.

గంటలు గడిచిపోతున్నాయి. దొనలో కటిక చీకటి తనకు తోడైంది. తనలో మిగిలివున్న ఆశలా మిణుకుమిణుకుమంటూ ఆకాశంలో ఒక్క నక్షత్రం మాత్రం కనిపిస్తోంది. అతన్ని పీడిస్తున్నవి ఒకటి గాదు. ఆకలి పేగుల్ని కాల్చివేస్తోంది. గాయాలు శరీ రాన్ని బాధిస్తున్నాయి. తన కిక విముక్తి లేదేమోనన్న నిరాశాభావం హృదయాన్ని కృంగదీస్తున్నది. ఏవేవో అనుమానాలు, భయాలు మనస్సులో ముప్పిరి గొంటున్నాయి.

నడిరేయివరకు అతనికి నిద్రలేదు. ఆ తరువాత అది—వర్షారాత్రిలో విద్యుద్దీపాల్లా రాకపోకలు జరి పింది...వాడు వచ్చాడు! దొనలోకి తొంగి చూశాడు! రాళ్లు దొర్లిస్తున్నాడు! తట్టలతో మట్టిత్రవ్వి పోస్తు న్నాడు! తాను సజీవంగా సమాధై పోతున్నాడు!... రాయప్ప కెవ్వుమన్నాడు. ముష్టివాడూ లేడు, మట్టి గడ్డలూ లేవు. గాలికి కొన్ని ఎండుటాకులు కొట్టు కొచ్చి తనమీద పడ్డాయి.

చీకటి కౌగిట్లో కూర్చున్న రాయప్ప మంక వెలుగుల్ని చూశాడు. పిట్టలకూతలు విన్నాడు. తెల్ల వారడంకూడా చూశాడు. ఎవరో తనకోసం రాబో తున్నట్లు, వారికోసమే తాను ఎదురు చూస్తున్నట్లు మాటిమాటికీ తలపైకెత్తి చూడసాగాడు. ఎవరూ రాలేదు. మనుషుల అలికిడైనా వినిపిస్తుందేమోనని చెవులు రిక్కించి విన్నాడు. అతని చెవులు అప్పటికే పనిచేయడం మాని వేశాయి. పైకి ప్రాకటానికి మరో సారి ప్రయత్నంచేసి విఫలుడై, కుప్పకూలి పోయాడు.

ప్రొద్దు పైకెక్కుతూన్న కొద్దీ, అతని నాలుక దాహంతో పిడుచగట్టుకు పోతోంది. ఆకలితో కడుపు మాడిపోతున్నది. చూపు మందగించి పోతున్నది. ఈ ఆకలి మంటను మించిన యాతన మరొకటి లేదు!...ఏమైనా కానీగాక!...ముష్టివాడు వచ్చినా రానీగాక....రాయప్ప బిగ్గరగా కేకలు వేయడం ప్రారం భించాడు. ఆ కేకలు ప్రపంచమంతటా వినబడి వుంటా యనుకున్నాడతను.

రాయప్ప అలసిపోయాడు. విసిగిపోయాడు. కడుపులో కాళ్లు పెట్టుకుని పడుకున్నాడు. ఈ పొట్టకోసం అన్ని జాగత్తలూ తీసుకున్న తాను ఆఖరికి గోతిలో పడిపోయాడు. తనకు కావలసింది గుక్కెడు నీరు, పిడికెడు అన్నం...

అతడి కళ్లు మూసుకుపోయాయి.

* * *

గుట్టమీద గోతిలో రాయప్ప కేకలు పెడు తూన్న సమయంలో—ముష్టివాడు చట్టి చేతబట్టు కుని పురవీథుల్లో నడయాడుతున్నాడు.

వాడు ఆ ఊరిలో భిక్షాటనం ప్రారంభించి యింకా మూడునెలలు పూర్తికాలేదు. వాడికి ఒక్క పూటైనా అన్నంపెట్టని యిల్లు ఆ ఊళ్ళో ఒక్కటే వుంది. ఎప్పుడూ వాలుకుర్చీకి అతుక్కుని కూర్చునే ఆ పుణ్యాత్ముడికి ముష్టివాళ్లను తిట్టి తరమడమే ఉద్యోగంలా గుంది! దేవుణ్ణి వాడు కోరుకునేదొక్కటే! మరుజన్మలో తాను ఆవాలు కుర్చీలో కూర్చోవాలనీ, అతనికింత ముష్టివెయ్యాలనీ!

ఆ యింట్లో అన్నం పెట్టించుకోలేక విసిగి పోయాడు వాడు. ప్రతిసారీ లేదనిపించుకోవడం, తిట్లు తినడం—వాడికి నామోషీగా అనిపించింది. ఇక ఆయింటి ముందర నిలబడ కూడదనుకున్నాడు.

సూర్యుడు నడినెత్తిన ప్రకాశిస్తోండగా— ఆ యింటిని సమీపించాడువాడు. అక్కడ ఆగకూడ దనుకున్నాడు. ముందుకు వెళ్లిపోతూ ప్రక్కకు తిరిగి చూశాడు. ఆశ్చర్యం! వాలుకుర్చీ అయితే వుందిగానీ, అందులో రాయప్పగారు లేరు! వాడిలో ఆశ మోసు

లెత్తింది. ఈ యింటికూడు తినే ప్రాప్తం తనకు వుందేమో!

'పట్టెడన్నం పెట్టు తల్లీ!'

వసారాలోనే స్తంభాని కానుకుని విషాద వదనంతో నిలుచున్న ఆ ఇంటి ఇల్లాలు ఆ కేకకు తలెత్తి చూచింది. ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చి, ఇంట్లోకి వెళ్లి, కొంత అన్నమూ, కూరాతెచ్చి వాడి చట్టిలో వేసింది.

వాడు కుతూహలాన్ని అణచుకోలేక 'అయ్యగోరెక్కడమ్మా?' అని అడిగాడు, యుగయుగాల బంధువులా.

'ఏమో నాయనా! నిన్నసాయంకాలం వెళ్లారు ఊళ్లో ఎవరింట్లోనూ లేరు ..ఎక్కడి కెళ్లారో, ఏమో?...'

వాడు ఏమో చెప్పబోతున్నట్లు నోరు తెరిచాడు. అయితే ఏమీ చెప్పలేదు...ఆయన నిన్న సాయంకాలం గుట్టమీద తనకు కనిపించాడు. ఎలా కనిపించాడో అలాగే మాయమైపోయాడు. ఇంటికి రాకపోతే—ఊళ్లో ఎవరింట్లోనూ లేకపోతే—మరెక్కడుండాలి?

ముష్టివాడు గిరుక్కున వెనక్కి తిరిగాడు.

* * *

ముఖంమీద చిలకరింపబడిన నీటి చల్లదనానికి గోతిలోని రాయప్ప మెల్లగా కదిలాడు. అతని పెదవులు అస్పష్టంగా కదిలాయి. నీళ్లముంత అతని పెదవుల్ని స్పృశించింది. రాయప్ప గుటగుటా నీళ్ళు త్రాగాడు. మెల్లగా లేచికూర్చున్నాడు. అతని కళ్లకు మసక మసకగా అన్నం కనిపించింది· గబుక్కున చట్టి చేతి కందుకుని, ఆనందంతో పిచ్చివాడిలా నవ్వుకున్నాడు. ఆ పురాపురుమంటూ అన్నం నోట కుక్కుకున్నాడు. రెండుముద్దలు దిగ్రమింగిన తరువాత గంభీరంగా చుట్టూ చూశాడు. ఊహించనిదేదో జరిగిపోయినంత విస్మయంతో నిశ్చేష్టుడైపోయాడు.

ఎవరు?

ఎవరది ?

నిలువునా కాలిపోయిన చింతమొద్దులావున్న ఆరడుగుల విగ్రహమూ, దిష్టిబొమ్మను తలపింపజేసే తెల్ల గుమ్మడికాయంత తల, గాజు గోళాలవంటి మిడిగుడ్లు, ముంతమామిడి కాయలాంటి ముక్కు, లావుపాటి పెదవులమీద భయంకరమైన పిచ్చినవ్వు...

రాయప్పకళ్ళు భీతితో సంచలించాయి. పెదవులు వణికాయి.

హడలెత్తించే పిచ్చినవ్వులతో తన ప్రక్కనే కూర్చునివున్న ముష్టివాడు బిడ్డను బుజ్జగించే పిశాచంలా పెదవి విప్పాడు.

'తినండయ్యగోరూ! ముష్టోణ్ణి సూస్తే, ముష్టికాయ తిన్నట్టుందా? దేముడుచేసిన ముష్టోణ్ణి కాదు బాబూ నేను. మణిసిజేసిన ముష్టోణ్ణి! నాకడుపు మీద కొట్టినోళ్ళు మణుసులే !...కట్టుకున్న ఆడది మట్టిలో గలిసిపోయింది ..కడుపున బుట్టినోళ్ల కడుపు సేతబట్టుకుని కాకుల్లా సెదిరిపోయినారు. మిగిలింది, నేను. మారాజుకైనా, ముష్టోడికైనా జానెడు పొట్టే గదా బాబూ; జానెడుపొట్టకు పట్టెడు మెతుకులు సాలు! ఈ పట్టెడు మెతుకుల కోసరం నేను—ముష్టెత్తు'కుంటున్నానుగానీ, యింకే పాపమూ సెయ్యలేదే!...

ముష్టివాడి కళ్ళలో కన్నీళ్ళు!

'తినండయ్యగోరూ! అట్ల జూస్తారేం నా వంక? నన్ను మీ రెరగర్లేండి. మీరు మాత్రం నా కెరికే! ఇరవయ్యేండ్లుగా నేన్నమ్ముకున్న మూడెకరాల పొరం బోకును—లంచం తీసుకుని—మా వూళ్లో మోతుబరి పరంజేసింది మీరే కదా !..మణిసి తినేది మెరుగు బంగారం కాదు బాబూ! పట్టెడు మెతుకులే! తినండయ్యగోరూ, తినండి!'

రాయప్ప కళ్లలో గిర్రున నీళ్ల తిరిగాయి.